## బోనాలు' తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజా పక్షం/ వేములవాడ:** బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా వేములవాడ పట్టణంలోని శ్రీ చెన్నకేశవ మత్తడి పోచమ్మ అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల స్వాగతం పలికి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ అమ్మవారి కటాక్షంతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ ఉత్సవాలు సమాజంలో ఐక్యతను,ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం

స్వీయ రక్షణ కోసం... కుటుంబ క్షేమం కోసం... ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి* ప్రధాన రహదారిపై చెట్లకు రేడియం స్టికర్స్ ఏర్పాటు.* వేములవాడ జిల్లా ఎస్‌పి



**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అప్రమత్తతతో పాటు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా ఎస్‌పి మహేష్ బి. గితే పిలుపునిచ్చారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వేములవాడ పట్టణ పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు, వాహనదారులకు, ప్రజా ప్రతినిధులకు నాంపెల్లి వద్ద గల వెంకటేశ్వర కళ్యాణ మండపంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో జనవరి నుండి ప్రతి నెల అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.రోడ్డు ప్రమాదాలకు 80% ప్రధాన కారణాలు మద్యం సేవించి వాహనాలు నడపడం, ఓవర్ స్పీడ్స్,హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, మైనర్ డ్రైవింగ్ అని అన్నారు.ఈ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం పోలీసుల కోసం కాదని, స్వీయ రక్షణతో పాటు కుటుంబ సభ్యుల భద్రత కోసం తప్పనిసరిగా పాటించాల్సిన బాధ్యత ప్రతి వాహనాదారుడిపై ఉందన్నారు. ప్రధాన రహదారుల వెంబడి ఉన్న చెట్లకు రేడియం స్టికర్స్ ఏర్పాటు చేయడం,తరచు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో రబ్బర్ స్ట్రిప్స్, ఇసుక డ్రంబులు బారి కెడ్స్, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని గోల్డెన్ అవర్ (మొదటి గంట)లో ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ.25,000 ప్రోత్సాహక నగదు అందజేస్తోందన్నారు. అనంతరం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసి నాంపెల్లి నుండి అనుపురం గ్రామం వరకు ప్రధాన రహదారి వెంబడి ఉన్న చెట్లకు రాత్రి సమయంలో వాహనదారులకు ములములుపులు స్పష్టంగా కనిపించేలా రేడియం స్టికర్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాసులు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, సి.ఐ లు,ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా నష్టాలునివారించుకోవాలి



### జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

**ప్రజాపక్షం/మేడిపెల్లి:** సూపర్ ఎల్నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న వర్షభావం సాగునీటి కొరత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేపట్టాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పంట మార్పిడి కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తోందన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మేడిపెల్లి మండలం పొరుమల్ల గ్రామంలో పర్యటించి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతుఈ ఏడాది సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశాలు ఉన్నాయని, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ లో ప్రస్తుతం 15 టీఎంసీల కంటే తక్కువ నీటి నిల్వలు మాత్రమే ఉన్నందున కెనాల్స్ ద్వారా సాగునీరు అందించే పరిస్థితి లేదన్నారు.ఈ నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరం ఉండే వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారు.పొరుమల్ల గ్రామంలో ప్రతి సంవత్సరం సుమారు 1,200 ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని, అయితే ఈసారి పరిస్థితులను అర్థం చేసుకుని దాదాపు 200 ఎకరాల్లో సరుగుడు తదితర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. రైతులు పంట మార్పిడికి సిద్ధంగా ఉన్నప్పటికీ కోత యంత్రాల లభ్యత, డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ షీట్లపై సబ్సిడీ అందించాలని కోరినట్లు తెలిపారు.రైతుల విజ్ఞప్తులపై స్పందించిన కలెక్టర్, ఉద్యానవన శాఖ అధికారులతో సమన్వయం చేసి జిల్లా స్థాయిలో సాధ్యమైనంత సహాయం అందిస్తామని చెప్పారు. ప్రస్తుతం డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ పండ్ల తోటలు,ఆయిల్ పామ్, కూరగాయల పంటలకు మాత్రమే వర్తిస్తున్నప్పటికీ, సరుగుడు పంటకు కూడా వర్తింపజేయాలనే అంశాన్ని రాష్ట్ర హార్టికల్చర్ శాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా సరుగుడు, ఆయిల్ పామ్, కూరగాయలు తదితర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయనున్న రైతుల వివరాలు, అవసరమైన బడ్జెట్‌పై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు.జిల్లాలో వరి సాగు చేసే రైతుల్లో సుమారు 70 శాతం మంది ఇంకా నాట్లు వేయకుండా వర్షాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. అయితే రానున్న రోజుల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం లేకపోవడంతో వరి సాగు చేసి మధ్యలో నష్టపోయే పరిస్థితి రాకుండా రైతులు ముందస్తు నిర్ణయం తీసుకోవాలని సూచించారు.అధిక నీటి అవసరం లేని సరుగుడు,ఆయిల్ పామ్,కూరగాయలు మరియు ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టి ఆర్థికంగా లాభపడాలని జిల్లా రైతులకు మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.ఈ పరిశీలనలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్,శిక్షణ డిప్యుటీ కలెక్టర్ కన్నం హరిణి, తహసీల్దార్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


## మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఉద్యోగులకు సస్పెన్షన్

### భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్




**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు కార్యాలయంలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగినిని లైంగికంగా వేధిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వీరిని వెంటనే ఉద్యోగం నుండి తొలగించాలని శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నగర సహాయ కార్యదర్శులు న్యాలపట్ల రాజు,పైడిపల్లి రాజులు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ఎన్నడు లేని విధంగా లైంగిక వేదింపులు ఆరోపణలు రావడం చాలా బాధాకరమని, మహిళా ఉద్యోగులను వేధించడం, ఫోన్ చేయడం, బెదిరించడం ఏదో పని చెప్పి నువ్వు పని చేస్త లేవు నీపై ఉన్నత స్థాయి అధికారులకు పిర్యాదు చెప్తామని చెప్పి లొంగదీసుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. నిత్యం ఏదో ఒక పని మీద వందలాదిమంది మహిళలుమున్సిపల్ కార్యాలయానికి వస్తారని ఇలాంటి సంఘటనలు బయట తెలిస్తే రావడానికి కూడా భయపడతారని పేర్కొన్నారు. మేము చెప్పిన చోటికి రాకుంటే నీ ఉద్యోగం పీకేస్తామని హుకుంజారీ చేసి లొంగదీసుకోవాలనేటువంటి కుట్రలకు పాల్పడడం సిగ్గుచేటు చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో మహిళ ఉద్యోగులను వేధింపులు చేస్తున్నారని ఉన్నతాధికారులకు చెబితే ఇంకా ఎక్కువ వేధింపులు గురి చేస్తున్నారని అన్నారు. వెంటనే మహిళ ఉద్యోగినిని వేధింపులకు గురి చేస్తున్న ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేయాలని, వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజులు డిమాండ్ చేశారు. స్పందించిన మేయర్ ఈ సమస్య పైన మహిళా అధికారులతో కమిటీ వేశామని కమిటీ రిపోర్ట్ రెండు రోజుల్లో వస్తుందని రిపోర్ట్ రాగానే వారి పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బ్రాహ్మణ పెల్లి యుగంధర్ , జువ్వాజి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## బడిబాటలో మౌలిక వసతులు: కలెక్టర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారితో కలిసి మండల విద్యాధికారులు, పంచాయతీరాజ్, ఇడబ్ల్యుఐడిసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో తరగతి గదుల మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణాలు, క్రీడా స్థలాల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంతల పనులు చేపట్టాలని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంపొందించి విద్యాసంస్థలను బలోపేతం చేయాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలని సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం నాణ్యతగా, పోషక విలువలతో అందించాలని స్పష్టం చేశారు. మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను నిరంతరం పర్యవేక్షించాలని, అపార్, ఆధార్ నమోదు శాతాన్ని పెంచాలని, పాఠశాల వివరాలను యుడైస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, పంచాయతీ రాజ్, ఈడబ్ల్యుఐడిసి ఇంజనీరింగ్ అధికారులు, విద్యా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌టిసి డిపో మేనేజర్లతో ఆర్ఎం సమీక్షా సమావేశం

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఆర్‌టిసి కరీంనగర్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల మేనేజర్లతో కరీంనగర్ రీజనల్ మేనేజర్ బి. రాజు కరీంనగర్ బస్ స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరములో సమీక్షా సమావేశము నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జూన్ మసాంతం వరకు ఆపరేషన్స్, మెంటెనెన్స్ విభాగాలలో రీజియన్ లోని అన్ని డిపోల పని తీరు ,ఆర్థిక పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదాలు నివారణ చర్యల గురించి సమీక్షించారు. బస్ ఆన్ కాంట్రాక్టు, టూర్ ప్యాకేజీలు, యాత్రాదానంకు ప్రజల నుండి లభిస్తున్న ఆదరణను సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశములో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్. భూపతిరెడ్డి, పి. మల్లేశం, డిపో మేనేజర్లు సి. హెచ్. కవిత, గోదావరిఖని, ఎన్. వెంకన్న, హుస్నాబాద్, వి. రవీంద్రనాథ్, హుజురాబాద్, ఐ. విజయమాధురి, కరీంనగర్–1, వి. శ్రవణ్ కుమార్, మంథని, ఎన్. రమేష్, జగిత్యాల, ఎన్. మనోహర్, కోరుట్ల, డి. హరి, మెట్ పల్లి, ఎ. ప్రకాశ రావు, సిరిసిల్ల, బి. శ్రీనివాస్, వేములవాడ, పి. రవి కుమార్, అకౌంట్స్ ఆఫీసర్, రీజనల్ మేనేజర్ కార్యాలయ సూపర్ వైజర్లు ఎం. స్రవంతి, ఆర్. జ్యోత్స్న పాల్గొన్నారు.

## తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాలు

**ప్రజాపక్షం/రామగిరి :** సింగరేణి సంస్థకు కేటాయించిన ప్రతిష్టాత్మకమైన తాడిచర్ల2 బ్లాక్ సాధన విజయోత్సవాలలో భాగంగా శుక్రవారం రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జీఎం కార్యాలయం నందు సాధన విజయోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును సంస్థకు కేటాయించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, సింగరేణి సంస్థ ఉన్నత అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం తాడిచర్ల2 బ్లాక్ సాధన పై రూపొందించిన కరపత్రాల తో పాటు ఉద్యోగులకు మిఠాయిలను పంపిణీ చేసి అందరితో కలిసి విజయోత్సవాలను జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు కోల శ్రీనివాస్, ఎస్వో టుజియం యం.రామ్మోహన్, ఏరియా ఇంజనీర్ ఏ. ఉదయ భాస్కర్, లతో పాటు వివిధ విభాగాధిపతులు,అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక లాభం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఆయిల్ పంప్ సాగుతో రైతులకు అధిక లాభం జరుగుతుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యాంప్రసాద్ అన్నారు. శుక్రవారం రోజున పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి శివారులోని గోపగోని రంజిత్ తోటలో పామాయిల్ మొక్కలను జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యాంప్రసాద్ మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ రైతులతో సమావేశమై తోటల నిర్వహణ,దిగుబడుల పెంపు, ఎరువుల యాజమాన్యం, నీటి నిర్వహణ, తెగుళ్లు మరియు పోషకాహార లోపాల నివారణపై సాంకేతిక సూచనలు అందించారు. ప్రస్తుతం సాగులో ఉన్న ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి రైతులు అనుసరిస్తున్న మెరుగైన సాగు విధానాలను అభినందించారు.శ్రీరాంపూర్ మండలంలో ఇప్పటికే విజయవంతంగా సాగుతున్న ఆయిల్‌పామ్ తోటలను చూసి మరో చాలా మంది రైతులు ఈ పంట వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. 202627 సంవత్సరానికి మండలంలో ఇప్పటివరకు 60 ఎకరాల్లో పామాయిల్ మొక్కలు నాటడం జరిగింది.అదనంగా ఇంకా 50ఎకరాల్లో కొత్తగా ఆయిల్‌పామ్ తోటలు ఏర్పాటు లక్ష్యంగా రైతులు ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు.రంజిత్ ని ఆదర్శంగా తీసుకుని మిగతా రైతులు పామాయిల్ పంట సాగు చేయాలని పిలుపునిచ్చారు.ఆయిల్‌పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంట అని, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, కంపెనీల సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని మరింత విస్తీర్ణంలో సాగు చేపట్టాలని సూచించారు. ఉద్యాన అధికారి మహేష్ , ఉద్యాన విస్తరణ అధికారి రాము, వ్యవసాయ అధికారిణి సంధ్య, ఎఎమ్‌సిచైర్మన్,మాజీ ఎంపిపి సారయ్య గౌడ్, సర్పంచ్‌రమేష్,ఏఇఒలు,ఫీల్డ్ ఆఫీసర్,రైతులుపాల్గొన్నారు.

## పౌర పఠన మందిరం సరే.. పుస్తకాలు ఏవి..?

### అధికారుల తీరుపై విద్యార్థులు, యువకుల అసహనం




**ప్రజాపక్షం/ముత్తారం:**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామపంచాయతీ ఆవరణంలో ఏర్పాటు చేసిన పౌర పఠన మందిరం (లైబ్రరీ) కేవలం పేరుకే పరిమితమైందని,"గ్రామంలోని విద్యార్థులు, యువకులు ఆరోపిస్తున్నారు. భవనం సరే.. చదువుకోవడానికి పుస్తకాలు ఏవి..? అంటూ వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు.జిల్లాలో గ్రంథాలయాలను కేవలం నామమాత్రంగానే ఏర్పాటు చేశారా అని యువత మండిపడుతోంది. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపయోగపడేలా ఎలాంటి పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంచకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్ మండలంలో పర్యటించినప్పటికీ, నేటికీ ఓడేడు గ్రామానికి పుస్తకాలు పంపించకపోవడంపై విద్యార్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఓడేడు పౌర పఠన మందిరానికి అవసరమైన విజ్ఞాన, పాఠ్యపుస్తకాలను సరఫరా చేయాలని గ్రామంలోని నిరుద్యోగ యువతీయువకులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎంచర్ల సాత్విక్‌కు విద్యార్థి సంఘాల నాయకుల ఘన నివాళి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం మండలం లింగాపూర్ మోడల్ స్కూల్లో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎంచర్ల సాత్విక్‌కి ఎఐఎస్ఎఫ్ ఎన్.ఎస్.యు.ఐ ఆధ్వర్యంలో విద్యార్థి లోకంతో కలిసి గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఘననివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, ఎన్ ఎస్ యూ.ఐ రాష్ట్ర కార్యదర్శి బైరిమల దుర్గ ప్రసాద్ లు మాట్లాడుతూ లింగాపూర్ మోడల్ స్కూల్లో క్రికెట్ ఆడుతుండగా బాలు కోసం వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎంచర్ల సాత్విక్ కు గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో విద్యార్థి లోకంతో మానవహారం నిర్వహించి,ఘన నివాళులర్పించడం జరిగిందని వారన్నారు.గత రెండు రోజుల క్రితం లింగాపూర్ మోడల్ స్కూల్ లో మరణించిన సాత్విక్ కుటుంబానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియా,బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్ ని వెంటనే సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు పెట్టాలని ఏఐఎస్ ఎఫ్, ఎన్ఎస్.యూ.ఐ ,విద్యార్థి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట నిరసన చెయ్యగా,పెద్దపల్లి జిల్లా ఆర్డీఓ పోరాటానికి దిగివచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానని మీడియా ముందు హామీ ఇవ్వడం జరిగిందని, బాధిత కుటుంబానికి న్యాయం జరగడం కోసం కృషిచేసిన రామగుండం నియోజకవర్గ శాసన సభ్యులు రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున విద్యార్థి లోకం హాజరై ఎంచర్ల సాత్విక్ కి ఘన నివాళులర్పించి విజయవంతం చేయడం జరిగిందని వారన్నారు. ఈ కార్యక్రమ విజయవంతానికి సహకరించినటువంటి విద్యాసంస్థలకు,ఉపాధ్యాయులకు ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుంటూ సాగర్,సురేష్,ధనాల మహేష్,సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావంపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం / గంగాధర :** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటి ఎద్దడిని తట్టుకునే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని వ్యవసాయ విస్తరణ అధికారి సాయికృష్ణ సూచించారు. గంగాధర మండలం కొండయ్యపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం గ్రామ సర్పంచ్ మల్యాల వినయ్ సాగర్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో సాయికృష్ణ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం కారణంగా సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు నమోదవుతున్నాయని దాంతోపాటు అధిక ఉష్ణోగ్రతలు కూడా నమోదవుతున్నాయని తెలిపారు. దీని ప్రభావం పంటల సాగుపై తీవ్రంగా పడుతుందని రైతులు వరి పంటలను నీటి పారుదల సౌకర్యం పూర్తిగా ఉన్న భూముల్లోనే సాగు చేయాలని కోరారు. తక్కువ కాల పరిమితి గల నీటి ఎద్దడిని తట్టుకునే కందులు, పెసలు, మినుములు, రాగులు, సజ్జలు, నువ్వులు వంటి పప్పు ధాన్య, నూనె గింజల పంటలు అలాగే కూరగాయలను సాగు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా నీటి యాజమాన్య పద్ధతులు పాటించి నీటిని వృథా చేయకుండా చర్యలు తీసుకోవాలని రైతులకు జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు అందరూ నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపాలని కొత్తపల్లి మండల వ్యవసాయ అధికారి కోట సంతోష్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాల, ఖాజీపూర్, సీతారాంపూర్ గ్రామాలలో రైతులకు ఆరుతడి పంటల సాగుపై గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతులు తమ ప్రాంత పరిస్థితులకు అనుగుణంగా కందులు, పెసలు, మినుములు, నువ్వులు, మొక్కజొన్న,సజ్జ వంటి ఆరుతడి పంటలను సాగు చేసి అధిక లాభాలను పొందాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కక్కుల చంద్రకళ మోహన్ రావు, కోమటిరెడ్డి అంజనీ ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారులు కె.రాజశేఖర్, ఎం.డి.ఫాజిల్, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలే

**ప్రజాపక్షం / జమ్మికుంట :** కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ పార్టీలు అవినీతి పార్టీలేనని బిజెపి రాష్ట్ర యువమోర్చ ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీన్ రెడ్డి ఆరోపించారు. బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు ఆధ్వర్యంలో శుక్రవారం సువర్ణ ఫంక్షన్ హాల్‌లో జమ్మికుంట పట్టణ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర యువమోర్చ ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీణ్ రెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల నుంచి ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోంటుందని మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అవినీతి పాలననే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తూ ప్రజలను మోసం చేస్తుందని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో బిజెపి జెండా తెలంగాణ రాష్ట్రంలో ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, జేడీ మల్లేశ్, కైలాసకోటి గణేశ్, రాజేశ్ ఠాకూర్, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో నిందితుడికి ఐదేళ్లు జైలుశిక్ష

**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర పోలీస్ స్టేషన్‌లో నమోదైన గంజాయి కేసులో నిందితునికి కరీంనగర్ 1వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ కోర్టు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5 వేలు జరిమానా విధించింది. కేసు వివరాల ప్రకారం నిందితుడు మెదక్ జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామం వడ్డెర కాలనీకి చెందిన వల్లెపు మల్లేశం అనే వ్యక్తి 2762022న గంగాధర మండలం గర్షకుర్తి గ్రామ శివారులో 1.260 కిలోల ఎండు గంజాయిని అక్రమంగా కలిగి ఉండగా గంగాధర పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం తహసీల్దార్ సమక్షంలో చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ సుమారు రూ.8,570 విలువైన 1.260 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు క్రైమ్ నం.97/2022, ఎన్‌డిపిఎస్ చట్టం 1985 సెక్షన్ 8(సి) ఆర్/డబ్ల్యు 20(బి) (2)(బి) కింద నమోదు చేశారు. విచారణ అనంతరం కరీంనగర్ 1వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించి శిక్ష ఖరారు చేసింది. ఈ తీర్పుతో 2026 సంవత్సరంలో గంగాధర పోలీస్ స్టేషన్‌కు ఇది 10వ కన్విక్షన్ కావడం విశేషం.

# సామాజిక న్యాయమే లక్ష్యం

### నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తాం

### తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇన్‌చార్జ్ సలేంద్ర కొమరయ్య

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి రాజకీయాల్లో బలమైన ముద్ర వేసే దిశగా తెలంగాణ రక్షణ సేన అడుగులు వేస్తోంది.పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమరయ్య శుక్రవారం రోజున బాధ్యతలు చేపట్టారు.ఈ కీలక బాధ్యతలను తనకు అప్పగించిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, బీసీల పక్షపాతిగా ఆమె చేస్తున్న కృషిని కొనియాడారు.గురువారం అధికారికంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సలేంద్ర కొమరయ్య మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా జిల్లాలో అగ్రవర్ణాల నాయకత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ,అణిచివేత ధోరణిని అవలంబించిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఒక బీసీ బిడ్డకు పెద్దపల్లి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం ద్వారా కవిత సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని,బీసీలకు 50 శాతం రాజకీయ వాటాను కల్పిస్తామన్న ఆమె హామీ వెనుకబడిన వర్గాలకు కొత్త ఆశను కల్పించిందని ఆయన పేర్కొన్నారు.పార్టీ అధినేత్రి కవిత నాయకత్వంలో వెనుకబడిన తరగతుల కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పాంచజన్యం పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.నియోజకవర్గంలోని ఉద్యమకారులు,బీసీ, ఎస్సీ ,ఎస్టీ, మైనారిటీ సంఘాలన్నింటినీ సమన్వయం చేసుకుంటూ,పార్టీ పిలుపు మేరకు తెలంగాణ రక్షణ సేన పార్టీని పెద్దపల్లిలో శక్తివంతమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతామని సలేంద్ర కొమరయ్య ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమరయ్య నియమించడం పట్ల ఆ పార్టీ జిల్లా నాయకులు,బీసీ సంఘం నేత ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు.అనేక ఉద్యమాల్లో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని,పార్టీ బలోపేతానికి సలేంద్ర కొమరయ్య అందించిన సహకారం అభినందనీయమని కొనియాడారు.ఆయన నాయకత్వంలో నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొంటూ,జిల్లా రక్షణ సేన శ్రేణుల తరపున ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలోబొంగోని శంకరయ్య గౌడ్,ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్, బొంకూరి సుభాష్,కల్వల తిరుపతి,చిట్టుమల్ల హనుమాండ్లు,తదితరులు పాల్గొన్నారు.

## ఓడేడులో ఇద్దరి ఆకస్మిక మృతి

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది.పోలం మల్లమ్మ (60)గురువారం తెల్లవారుజాము న ఒక్కసారిగా రక్తపోటు (లో బీపీ) తగ్గి పడిపోయిన మల్లమ్మను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే కన్నుమూశారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ యాదగిరిరావు,వార్డు సభ్యుడు లక్ష్మీ చంద్రయ్య ఆమె భౌతికకాయాన్ని పరామర్శించారు.అలాగే ఓడేడు గ్రామానికి చెందినశీలం అశోక్ (45)గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అశోక్, ఆరోగ్యం క్షీణించడంతో పెద్దపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు.గతంలో కుమార్తెను, ఇప్పుడు ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతిలో మునిగిపోయింది. ఈ రెండు ఘటనలతో ఓడేడు గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

## భూభారతి భూ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాపక్షం /మల్హాపూర్ : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూభారతి భూ రి సర్వే కు రైతులంతా అధికారులకు సహకరించాలని తాసిల్దార్ రామచందర్ అన్నారు. ఈ సందర్భంగా గుండంపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో భూభారతి భూ సర్వే పై గ్రామ సర్పంచ్ దప్పుల పద్మ నరసయ్యతో కలిసి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. సందర్భంగా సర్పంచ్ పద్మ నరసయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సర్వేతో రైతుల్లో నెలకొన్న వివాదాలు తొలగిపోతాయని, సర్వేలో అధికారులను రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ అశోక్, సర్వేయర్, నాయకులు అంతడుపుల నరసయ్య, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

## ఠాణాకు చేరిన పంతుళ్ల పంచాయితీ

ప్రజాపక్షం / చందుర్తి : మండలం లోని బండపల్లి ప్రభుత్వ పాఠశాలలో దాదాపు ఏడాది కాలంగా నడుస్తున్న సీనియర్ ,జూనియర్ పంతుళ్ల పంచాయితి దాడికి దారి తీzయడం తో శుక్రవారం ఠాణాకు చేరింది. బండపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందరెడ్డి,సీనియర్ ఉపాధ్యాయుడు రాంచంద్రం ను కాదని మరొకరికి బాధ్యతలు అప్పజెప్పుతున్నారని కొద్ది రోజులుగా వివాదం నడుస్తోంది.ఈ క్రమం లో శుక్ర వారం హాజరు రిజిస్టరు లో సంతకం విషయం లో గొడవ తలెత్తి తమ పై దాడి జరిగిందని పాఠశాలరైతుల్లో నెలకొన్న ప్రధానోపాధ్యాయులు ఆనందరెడ్డి , సీనియర్ ఉపాధ్యాయుడు రాం చంద్రం ఒకరిపై ఒకరు చందుర్తి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఎస్సై జిల్లెల్ల రమేష్ బండపల్లి ప్రభుత్వ పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు.విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు ఈ విధంగా తగువులాడుకోవడం సరైనది కాదని ఈ విషయాన్ని విద్యాశాఖ ఉన్న zతాధికారులు దృష్టికి తీసుకెళ్తామన్నారు. మరోసారి ఇలాంటి ఘ టన జరిగితే తహసిల్దార్ ముందు బైండోవర్ చేస్తామని హెచ్చరించారు.

## మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధే నాబార్డ్ ధ్యేయం

### డీజీఎం దిలీప్ చంద్ర



ప్రజాపక్షం /పెగడపల్లి : ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున, రైతులు సాంప్రదాయ వరి సాగుపైనే పూర్తిగా ఆధారపడకుండా ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారి ఓ. శ్రీకాంత్ సూచించారు. నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో రైతులకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దిలీప్ చంద్ర మాట్లాడుతూ నాబార్డ్ స్థాపన నేపథ్యం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారతతో పాటు వ్యవసాయ రంగ వికాసంలో సంస్థ పోషిస్తున్న కీలక పాత్రను వివరించారు. అనంతరం వ్యవసాయ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ.. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా సమిష్టి వ్యవసాయం, సరైన మార్కెటింగ్ చేసుకుని రైతులు తమ ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కంది, పెసర, మినుము వంటి ఆరుతడి పంటలు వేసుకోవడం లాభదాయకమన్నారు. పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని, స్థిరమైన ఆదాయం పొందడానికి సహజ వ్యవసాయం, భూసార పరిరక్షణ పద్ధతులు పాటించాలని రైతులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాజారాంపల్లి సర్పంచ్ రమేష్, ఏఈఓ అక్షయ్, ఎన్‌జీఓ కోఆర్డినేటర్ సంపత్, పంచాయతీ కార్యదర్శి, పొన్నగుట్ట మల్లికార్జున స్వామి ఎఫ్‌పీఓ మేనేజింగ్ డైరెక్టర్, ఎఫ్‌పీఓ డైరెక్టర్లు, సభ్యులు,స్వయం సహాయక సంఘాల మహిళలు,పెద్ద రైతులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

### రూ.20 వేల జరిమానా


ప్రజాపక్షం/పెద్దపల్లి : పోత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధిస్తూ పెద్దపల్లి పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది.బాధితురాలు ఓదెల మండలంలో 9వ తరగతి చదువుతున్న సమయంలో నిందితుడు దున్నపోతుల కుమార్ ఆమెను తరచూ వెంబడిస్తూ పరిచయం పెంచుకున్నాడు.అనంతరం ఫోన్ ద్వారా ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేశాడు.ఒక రోజు కుటుంబ కలహాల నేపథ్యంలో బాధితురాలు తన అక్క నివాసమైన కరీంనగర్ జిల్లాకు ఒంటరిగా వెళ్తుండగా,నిందితుడు ఆమెను వెంబడించి బలవంతంగా తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని సుల్తానాబాద్ సమీపంలోని రేగడి మద్దికుంట గ్రామంలోని సెల్ టవర్ వద్దకు తీసుకెళ్లి, వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాధితురాలిని ఆమె అక్క ఇంటికి వెళ్లే బస్సులో ఎక్కించాడు.కొన్ని రోజుల తరువాత బాధితురాలు తిరిగి తన గ్రామానికి వచ్చిన అనంతరం,మరోసారి కిరాణా దుకాణానికి వెళ్తుండగా నిందితుడు ఆమెను బలవంతంగా గ్రామంలోని పటేళ్ల కొట్టం వద్దకు తీసుకెళ్లి మళ్లీలైంగిక దాడికిపాల్పడ్డాడు.తదనంతరం బాధితురాలికి కడుపునొప్పి రావడంతో ఆమె తల్లి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా,వైద్యులు పరీక్షించి బాధితురాలు గర్భవతి అని నిర్ధారించారు.దీంతో బాధితురాలు తనను వివాహం చేసుకోవాలని నిందితుడిని కోరగా, అతడు నిరాకరించాడు.పెద్దపల్లి పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో శుక్రవారం రోజున కేసు విచారణ జరగగా న్యాయమూర్తి స్వప్నరాణి ఇరుపక్షాల వాదనలు, సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడు దున్నపోతుల కుమార్‌పై మోపిన అభియోగాలు రుజువయ్యాయని నిర్ధారించి,10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ కేసులో నేరం రుజువై నిందితుడికి శిక్ష పడడంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంకెన రవీందర్ సమర్థవంతంగా వాదించి కీలక పాత్ర పోషించారు.పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి,ఏసీపీ జి. కృష్ణ పర్యవేక్షణలో సాక్షులను రంజిత్ రావు,సుల్తానాబాద్, ఎస్సై చి.ననత్ కుమార్,పోత్కపల్లి, కోర్టు కానిస్టేబుల్ పి.శ్రీనివాస్,హెచ్‌సీ204, లైజన్ ఆఫీసర్ పి. కోటేశ్వరరావు హెచ్‌సీ2465లను రామగుండం పోలీస్ కమిషనర్, డీజీ అంబర్ కిషోర్ ఝా,ఐపీఎస్. అభినందించారు.

## పోలీసులు, పాత్రికేయులు సమాజానికి వారధిగా నిలవాలి

### ఎస్పీ మహేష్ బి. గీతే.

ప్రజా పక్షం/ వేములవాడ టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణ రహదారి భద్రతపై వేములవాడ పట్టణం వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే ముఖ్య అతిథిగా హాజరై ప్రమాదాలకు ప్రధాన కారణాలు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ట్రాఫిక్ నిబంధన తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించిన అనంతరం జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే స్థానిక పాత్రికేయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారులపై తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, ట్రాఫిక్ సమస్యలు ఉన్న ప్రాంతాలు, అలాగే అక్రమ గంజాయి రవాణా, విక్రయాలు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీసులు పాత్రికేయులు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో, సామాజిక బాధ్యతతో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. ప్రజల సహకారం, పాత్రికేయుల సమన్వయంతో సురక్షితమైన సమా జ నిర్మాణానికి పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్పీ తెలిపారు.

## చలో సరూర్ నగర్ ...యువ సంగ్రామ సదస్సు



ప్రజాపక్షం/గొల్లపలి: సరూర్ నగర్ స్టేడియంలో జరిగే బి ఆర్ ఎస్ యువ సంగ్రామ సదస్సుకు యువత భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ యూత్ నాయకులు ఆవారి చందు పిలుపునిచ్చారు.శుక్రవారం జగిత్యాల జిల్లాగొల్లపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బి ఆర్ ఎస్ విద్యార్థి విభాగం ,యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో సరూర్ నగర్ యువ సంగ్రామ సదస్సు ఈనెల 18 న సరూర్ నగర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ యూత్ నాయకుడు ఆవారి చందు తెలిపారు . వాహనంపై ఎక్కించుకుని సుల్తానాబాద్ సమీపంలోని రేగడి మద్దికుంట గ్రామంలోని దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాధితురాలిని ఆమె అక్క ఇంటికి వెళ్లే బస్సులో ఎక్కించాడు.కొన్ని రోజుల తరువాత బాధితురాలుఎన్నికల సమయంలో యూత్ డిక్లరేషన్ పేరుతో తెలంగాణ యువతకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విద్యార్థులను నిరుద్యోగ యువతను తీవ్రంగా నిరాశ పరిచిందని విమర్శిం చారు .ఈ నేపథ్యంలో తెలంగాణ యువత సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు యువత హక్కుల సాధన కోసం ఈ యువ సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు .బి ఆర్ ఎస్ యువ సంగ్రామ సభకు యువకులు విద్యార్థులు నిరుద్యోగులు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## వర్షాలు కురవాలని మహిళల జలాభిషేకం

ప్రజాపక్షం / జమ్మికుంట : వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వర్షం కోసం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం రంగమ్మపెల్లి గ్రామంలో శుక్రవారం మహిళలందరూ ఇంటికొక బిందెడు నీళ్లు తీసుకొని కుల దైవాలకు జలాభిషేకం చేసి పాటలు పాడుతూ వర్షాలు కురవాలని మహిళలంతా కలిసి గ్రామ దేవతలకు పూజలు చేశారు. పాడి పంటలు మంచిగా ఉండాలని వర్షాలు లేక ఇప్పటికే అల్లాడుతున్నామని పంటలు సరిగా రావడం లేదని, బావులలో, చెరువుల్లో నీళ్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వాన దేవుడు కరుణించి మాకు వర్షాలు కురిపించాలని వన దేవతలకు జలాభిషేకం చేసి మహిళలంతా కలిసి పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఐపిఎస్ విద్యార్థి

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : పెద్దపల్లి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్ (ఐపీఎస్) విద్యార్థి ఎం. సంప్రీత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 12న సుల్తానాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జరిగిన 1000 మీటర్ల పరుగు పందెంలో సంప్రీత్ గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటాడు.ఈ విజయంతో ఈ నెల 18న మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే అర్హతను దక్కించుకున్నాడు.ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినందించారు.రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించి పాఠశాలకు, సుల్తానాబాద్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థి విజయం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత,మేనేజర్ శివ,పీఈటీలు సత్యం, సతీష్ జ్యోతి తదితరులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

## ఎల్‌నిన్ ప్రభావంపై రైతులకు అవగాహన సదస్సు

ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండలంలోని ఓడేడు ,లక్కారం, మైదంబండ, ఖమ్మంపల్లి, ఇప్పలపల్లి, జిల్లెలపల్లి గ్రామ పంచాయతీలలో ఎల్నినో ప్రభావం, పంట మార్పిడి, ఆరుతడి పంటల సాగుపై రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.ఎల్నినో ప్రభావం కారణంగా జూలై,ఆగస్టు నెలల్లో వర్షాలు బలహీనంగా లేదా అసమానంగా పడే అవకాశం ఉందని రైతులకు వివరించారు. గతేడాది జూలైతో పోలిస్తే ప్రస్తుతం భూగర్భ జలాలు 1.5 మీటర్ల వరకు తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు లేకపోవడం వల్ల మండలంలోని చెరువులు,కుంటలలో కేవలం 50 శాతం మాత్రమే నీరు అందుబాటులో ఉందన్నారు.ప్రస్తుత నీటి లభ్యతనునీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలైన కందులు,పెసలు, మినుములు,నువ్వులు, జొన్నలు,సజ్జలు వంటి పంటలను సాగు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎన్ఆర్ఎస్‌పీ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు కే.మనీషా, బి. శశిధర్,ఎస్. శ్రీలేఖ తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

ప్రజాపక్షం /ముస్తాబాద్: ముస్తాబాద్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా, అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు గృహ నిర్మాణ అనుమతి ప్రొసీడింగ్ కాపీల పంపిణీ కార్యక్రమం ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యాదమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ, సొంత స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ దేవరాజ్, పోతుగల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అనమేని రాజు, ఎన్ఆర్ఐ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు తలారి నరసయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మెరుగు కిరణ్, చంద్రమౌళి, ఆంజనేయులు, జంగరాజు, మాధవరావు, విద్యాధర్, బాలకృష్ణలతో పాటు లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిపిఎఫ్, పింఛన్ ఆడిట్ సమస్యల పరిష్కారానికి సరైన వేదిక

ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్: ప్రభుత్వ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్, పింఛన్ సేవల్లో నాణ్యత, వేగవంతం పెంచేందుకు ఈ సేవలను పూర్తిగా డిజిటలైజేషన్ చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిత్ తెలిపారు. పింఛన్, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ సేవల అదాలత్ అకౌంట్స్, ఆడిట్, పెన్షన్, జిపిఎఫ్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి వర్క్ షాప్ కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. తెలంగాణ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్, కలెక్టరేట్ ఆధ్వర్యంలో



నిర్వహించిన ఈ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. పింఛన్, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ సొమ్ము జమ కావడంలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులు ఈ అదాలత్‌లో తమ ధరఖాస్తులను సమర్పించారు. కొన్ని సమస్యలను అక్కడే పరిష్కరించిన అధికారులు, మరిన్ని ధరఖాస్తుల పరిష్కారానికి రిటైర్డ్ ఉద్యోగులకు, డిడిఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిత్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లోని డిడివోలు ఆడిట్ నియమ నిబంధనలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిపిఎఫ్ పింఛన్ ప్రతిపాదనలు పంపినప్పుడు సమగ్రంగా పరిశీలించి నియమ నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు జత చేసి పంపాలని సూచించారు. రిటైర్డ్ ఉద్యోగులకు కూడా ఈ అంశాలపై అవగాహన కల్పించి ప్రతిపాదన తయారీలో ఏలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని అన్నారు. తద్వారా ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసిన వెంటనే ఏలాంటి ఇబ్బందులు లేకుండా వారి వారి ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో పొందుతారని తెలిపారు. రిటైర్మెంట్ తేది ముందుగానే తెలుస్తుంది కాబట్టి మూడు నెలల ముందే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. జనరల్ అభయ్ అనిల్ సోనార్కర్, జిల్లా ట్రెజరీ అధికారి నాగరాజు, కలెక్టరేట్ ఏవో సుధాకర్, వివిధ శాఖల డిడివోలు, ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్లు, సబ్ ట్రెజరీ అధికారులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా గదులు, విద్యార్థులు చదువుకునేదేలా

ప్రజాపక్షం /మల్లాపూర్ : మండలంలోని వేంపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమంలో నిర్మాణం తలపెట్టిన పాఠశాల గదులు అసంపూర్తిగానే మిగిలిపోయాయని విద్యార్థులు చదువుకునేదేలా అంటూ మాజీ సర్పంచ్ బిట్ల సరోజన అన్నారు.గత ప్రభుత్వం అదనపు గదుల నిర్మాణానికి నిధులు కేటాయించి 80 శాతం పనులను పూర్తి చేయగా బిల్లులు చెల్లించి మిగతా పనులను పూర్తి చేయాల్సిన ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు.పాఠశాలల్లో 120 మంది విద్యార్థులకు సరిపడ గదులు లేక ఎన్నో అస్తులు పడుతున్నారని ప్రభుత్వం అధికారులు స్పందించి మిగిలిన పనులను పూర్తి చేసి గదులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

## వేంపేట్ గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

ప్రజాపక్షం /మెట్‌పల్లి : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా,దోమల నివారణ చర్యల్లో భాగంగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వేంపేట్ గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని డ్రైనేజీలు, నిల్వ నీటి ప్రాంతాలు, బావుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా ప్రతి కుటుంబం సహకరించాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.సీజనల్ వ్యాధుల నివారణలో పరిశుభ్రతతో పాటు దోమల నివారణ చర్యలు ప్రతి ఒక్కరూ పాటించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ అల్లూరి సురేందర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి రాజు,పల్లె దవాఖాన వైద్యుడు డా. నాగార్జున, ఏఎన్ఎం కవితారాణి,వార్డు సభ్యులు చంద్రాచారి, దశకంఠ రాజు, జెల్ల శ్రీనివాస్ యాదవ్, నల్ల శేఖర్ రెడ్డి, నలిమేల అంజిరెడ్డి, గోరుమంతుల రఘు,ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాల వీఓ లీడర్లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి పురపాలక సంఘం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని,ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా త్వరితగతిన పనులు పూర్తిచేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు.రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో పట్టణంలోని వివిధ వార్డుల్లో కొన సాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి తోపాటు ఇప్పటికే పూర్తి అయిన సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని నాగలక్ష్మి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## ఆత్మవిశ్వాసం, చదువుపై అంకితభావంతో ముందుకు సాగాలి

ప్రజాపక్షం /జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపెల్లి మోడల్ స్కూల్‌ను అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి.రాజగౌడ్ శుక్రవారం సందర్శించి పాఠశాల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, విద్యా వాతావరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు,తాగునీరు, పారిశుద్ధ్యం,వంటశాల,భోజనశాల తదితర సౌకర్యాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు అదనపు కలెక్టర్ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు,విద్యార్థులతో మమేకమై వారి విద్యాభ్యాసం, బోధన విధానాలపై అదనపు కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యారంగంలో ప్రతిభ కనబరచాలని వారు సూచించారు. భవిష్యత్తు లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం నేర్చుకునే తపనతో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ విద్యార్థులను ప్రోత్సహించారు.అనంతరం



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి,భోజన నాణ్యతను అదనపు కలెక్టర్ పరిశీలించారు.విద్యార్థులతో ఆప్యాయంగా మా ట్లాడి వారి అభిప్రాయాలను అదనపు కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ ఎంపిడివో రమాదేవి, ఎంపివో రవిబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ సరిత దేవి, వైస్ ప్రిన్సిపాల్ నాగేష్, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బ గ్రామ పంచాయతీలో శుక్రవారం రైతులకు ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వరికి ప్రత్యామ్నాయ పంటలు, ప్రకృతి వ్యవసాయంపై మండల వ్యవసాయ అధికారి ఆకు రాజకుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలు సాగు చేయాలని,జీవామృతం, బీజామృతం వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని సూచించారు. అదేవిధంగా అమ్మకాపేటలో ఏఈవో వినోద్, వేములకుర్తిలో రవళిక, ఫకీర్ కొండాపూర్‌లో సాగర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు కాశిరెడ్డి భాస్కర్, తరి రామానుజం, తోట రమేష్,మాజీ సర్పంచ్ పుప్పాల నరసయ్య,మాజీ ఎంపీటీసీ జీవన్ పాల్గొన్నారు.

## పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తూ బలోపేతానికి శ్రమించే నాయకులే వార్డు అధ్యక్షులు

ప్రజాపక్షం/ రాజన్నసిరిసిల్ల : పార్టీ కోసం నిబద్ధతతో పని చేస్తూ, సంస్థాగత బలోపేతానికి శ్రమించే నాయకులు, కార్యకర్తలకే వార్డు అధ్యక్షులుగా అవకాశం కల్పిస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 10, 11, 12, 24వ వార్డులలో నూతన అధ్యక్ష పదవుల కొరకు ఆశావహుల నుండి దరఖాస్తులను సేకరించారు. ఈ సందర్భంగా సంగీతం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సూరదేవరాజు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం కోసం నూతన వార్డు అధ్యక్షుల నియామక ప్రక్రియను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం.

**ప్రజల్లో పార్టీ పట్ల మరింత మద్దతును కూడగట్టడం..**

వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరలోనే అర్హులైన నాయకులకు ఆయా వార్డుల బాధ్యతలను అప్ప



గించనున్నట్లు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ సంగీతం శ్రీనాథ్, మాజీ వైస్ ఎంపీపీ చల్ల హరికృష్ణ, ఆకునూరి బాలరాజు, దేవరాజ్ రెడ్డి, సుంకరి సాయి, ఆడెపు ప్రసాద్, సదుల గంగాధర్, కోలకాని రాజేశం, నాగభూషణం, మ్యాన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జనగణన రెమ్యునరేషన్ విడుదల చేయాలి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జనాభా గణన – 2027 లో భాగంగా మొదటి దశ ఇళ్ళ గణన విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు ఇంతవరకు రెమ్యునరేషన్ ఇవ్వలేదని వెంటనే రెమ్యునరేషన్ జారీ చేయాలని అడిషనల్ కలెక్టర్ నగేష్ కు ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు రేవోజు సదానందం వినతిపత్రం అందజేశారు. వేసవితాపాన్ని లెక్కచేయకుండా ఇళ్ళ గణన పూర్తి చేసిన జిల్లా అధికారులకు, మండల అధికారులకు, సూపర్వైజర్ మరియు ఎన్యుమరేటర్లకు వెంటనే రెమ్యునరేషన్ జారీ చేయాలని కేంద్ర జనాభా గణన ముఖ్య అధికారి సైతం ఉత్తర్వులు విడుదల చేశారని గుర్తు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి లక్ష్మణ్ మాట్లాడుతూ వేసవి మొత్తం విధులల్లో భాగంగా రిజర్వ్ ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని, కానీ వారికి కేవలం ట్రైనింగ్ కాలపు డ్యూటీ సర్టిఫికెట్ మాత్రమే జారీ చేసారని తెలుపుతూ వేసవి మొత్తం విధులకు అందుబాటులో ఉన్నందున మే 11 నుండి జూన్ 9 వరకు డ్యూటీ సర్టిఫికెట్ జారీ చేయాలని కోరగా అంశాన్ని పై అధికారులతో మాట్లాడుతామని తెలియచేశారు.

## ప్రైవేటీకరణను విరమించుకోవాలని విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాపక్షం/గొల్లపల్లి : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో కోల్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్లు నిర్వహణను ప్రైవేటీకరణకు అప్పజెప్పే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ జగిత్యాల జిల్లా గొల్లపల్లి సబ్ డివిజన్ పరిధిలో తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ (టీజీ పీఈ జేఏసీ ) ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యో



గులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు.ప్రైవేటీకరణ నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ నినదించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ప్రైవేటీకరణ నేపథ్యంలో తెలంగాణ ప్రజలు విద్యుత్ ప్లాంట్ లో పనిచేసే ఉద్యోగులపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగుల భద్రతకు ముప్పు ఏర్పడటమే కాకుండా రైతులు, సామాన్య ప్రజలు, చిన్న పరిశ్రమలపై కూడ తీవ్ర ఆర్థిక భారం పడే ప్రమాదం ఉందన్నారు.ప్రజల సొమ్ముతో నిర్మించిన విద్యుత్ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు చేపట్టడం సరికదని ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి విద్యుత్ ప్లాంట్ల ప్రైవేటీకరణను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు ఇలాంటి నిరసనలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వరుణ్ కుమార్, ప్రసాద్, వెంకట రమణ, రవి శంకర్, ప్రకాష్, ట్రాన్స్‌కో ఏడీఈ,ఏఈ, గొల్లపల్లి సబ్ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల : అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం క్రమం తప్పకుండా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడులోని అంగన్వాడి కేంద్రంలో జిల్లా



కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని కోడిగుడ్లు, బాలామృతం, పిల్లల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. రోజు ఎందరు పిల్లలు వస్తున్నారు? వారికి ఆట పాటల ద్వారా బోధన పై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల సేవలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోడిగుడ్లు, పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. పిల్లలు ప్రతి రోజూ కేంద్రానికి వచ్చేలా చూడాలని, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆటపాటల ద్వారా పిల్లలకు సులభంగా బోధన చేయాలని పేర్కొన్నారు.

## తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తక్షణమే నిర్మించాలి

ప్రజాపక్షం / కౌటాల : తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని కోరుతూ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం ఉదయం ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కన్వీనర్ నైనాల గోవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం బ్యారేజీల పరిస్థితి, ఎలినో ప్రభావంతో ఏర్పడిన కరువు నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ప్రాంతీయ అవసరాలను తీర్చే ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## స్లేట్ పాఠశాలల్లో ఇన్వెస్టిచర్ సెరిమనీ

చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి

ప్రజాపక్షం / జన్నారం : జన్నారంలోని స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో స్లేట్ హై స్కూల్, స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన ఇన్వెస్టిచర్ సెరిమనీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఏనుగు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నాయకత్వం అంటే హోదా కాదని, బాధ్యత అని అన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, సమయపాలన, జట్టు స్ఫూర్తి, సేవా దృక్పథం వంటి విలువలు ప్రతి విద్యార్థిని విజయవంతమైన నాయకుడిగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా నూతన విద్యార్థి నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు. హెడ్ బాయ్స్, హెడ్ గర్ల్స్, వైస్ హెడ్‌లు, హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు, వివిధ విభాగాల మినిస్టర్లకు బ్యాడ్జీలు, సాష్‌లు అందజేసి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తహసీల్దార్ బక్కయ్య మాట్లాడుతూ విద్యార్థి దశలో అలవడిన క్రమశిక్షణ, బాధ్యత, సేవాభావం జీవిత విజయానికి పునాదిగా నిలుస్తాయని తెలిపారు. ఎస్ఐ గుర్రం ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ విద్యార్థి నాయకులు చట్టాల పట్ల గౌరవం, క్రమశిక్షణ, బాధ్యతతో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. దేశభక్తి గీతాలు, హౌస్ ఫ్లాగ్ ప్రదర్శనతో ఈ కార్యక్రమం ఉత్సాహాభరితంగా సాగింది.పాఠశాల వ్యవస్థాపకులు సుభాష్ రెడ్డి, డైరెక్టర్ రజిత రెడ్డి, ప్రిన్సిపాల్లు ప్రియా శివ, షిరిన్ ఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మారుమూల గిరిజన గ్రామంలో ఆరోగ్య శిబిరం

ప్రజాపక్షం / జైనూర్ : జైనూర్ మండలంలోని మారుమూల గిరిజన గ్రామం కొండపాటర్‌లో శుక్రవారం ఉషేగావ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించినట్లు వైద్యుడు డాక్టర్ వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి చికిత్స పొందాలని, వైద్యుల సూచన మేరకే మందులు వాడాలని కోరారు. ఆరోగ్య శిబిరంలో భాగంగా గ్రామంలో ఇంటింటి జ్వర సర్వే నిర్వహించి అవసరమైన వైద్య పరీక్షలు చేశారు. దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు డ్రై డే కార్యకలాపాలు చేపట్టి, ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

## మధ్యాహ్న భోజనంలో రాళ్లు
# నాసిరకం కూరలతో విద్యార్థుల అవస్థలు

ప్రజాపక్షం/వాంకిడి : వాంకిడి మండలం ఖమన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాసిరకం మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. అన్నంలో రాళ్లు వస్తున్నాయని, కూరలు నాణ్యంగా ఉండటం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల ఫిర్యాదుతో గ్రామ సర్పంచ్ గెడ్డం సునీత, ఉపసర్పంచ్ లోబడే లాహుకుమార్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి పాఠశాలను సందర్శించి భోజనాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో భోజన నాణ్యత లోపించినట్లు ప్రజాప్రతినిధులు గుర్తించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, వంట సిబ్బంది విద్యార్థులతో సరిగా వ్యవహరించడం లేదని కూడా విద్యార్థులు ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన బియ్యం, తాజా కూరగాయలు, పరిశుభ్రమైన వంటతో నిర్ణీత మెనూ ప్రకారం ఆహారం అందించాల్సి ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించిందని గ్రామస్తులు మండిపడుతున్నారు. నాసిరకం ఆహారం వల్ల చిన్నారులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ గెడ్డం సునీత మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కొందరి నిర్లక్ష్యం వల్ల అపఖ్యాతిపాలు కాకూడదని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, లోపాలకు కారణమైన బాధ్యులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని



డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.ఈ ఆరోపణలపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గయ్య వివరణ ఇస్తూ... పైస్థాయి నుంచి సరఫరా అవుతున్న బియ్యంలోనే రాళ్లు వస్తున్నాయని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పదిహేను రోజుల్లో నివేదిక పంపిస్తామని తెలిపారు. తాను పాఠశాలలో లేని సమయంలో వంట సిబ్బంది, ఉపాధ్యాయుల ప్రవర్తనపై పూర్తి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గెడ్డం సునీత, ఉపసర్పంచ్ లోబడే లాహుకుమార్, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గయ్య పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలి

ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు నంది పద్మ

ప్రజాపక్షం / వాంకిడి : వాంకిడి మండలంలోని చిచ్‌పల్లి, సోనాపూర్, గణేష్‌పూర్, పూనగూడతో పాటు మొత్తం ఏడు గ్రామాలకు చెందిన మహిళలు తమ గ్రామాల్లో నడుస్తున్న అక్రమ మద్యం బెల్ట్ దుకాణాలను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పికి వినతి పత్రం అందజేశారు. ఈ ఆందోళన కార్యక్రమానికి ఆల్ ఇండియా డెమొక్రటిక్ విమెన్స్ అసోసియేషన్ (ఐద్వా) జిల్లా ఉపాధ్యక్షురాలు నంది పద్మ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగడం వల్ల యువతతో పాటు కుటుంబ పెద్దలు మద్యానికి బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యపానం కారణంగా కుటుంబాల్లో తరచూ గొడవలు జరుగుతున్నాయని, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులకు వినియోగించాల్సిన ఆదాయం మొత్తం మద్యానికే ఖర్చవుతోందని పేర్కొ



న్నారు. గతంలో ఈ సమస్యపై వాంకిడి పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తమ గ్రామాల్లో కొనసాగుతున్న సుమారు 10 బెల్ట్ షాపులను వెంటనే మూసివేసి ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్, ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, గ్రామ మహిళలు విమల బాయి, సుప్రియ, గీత, అంజలి, రేష్మ పాల్గొన్నారు.

## మార్కెట్ బస్టాండ్‌కు ఆర్‌టిసి బస్సులను మళ్లించాలి

టిఎన్ఎస్ఎఫ్ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు ఎండి వాజీద్

ప్రజాపక్షం / మందమర్రి : మందమర్రి పట్టణ నడిబొడ్డున ఉన్న మార్కెట్ ఆర్‌టిసి బస్టాండ్‌లోకి అన్ని బస్సులను తప్పనిసరిగా మళ్లించాలని తెలంగాణ నేషనల్ స్టూడెంట్స్ ఫ్రంట్ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు ఎండి వాజీద్ డిమాండ్ చేశారు. విద్యార్థులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆర్‌టిసి డిపో ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందమర్రి ప్రాంతానికి చెందిన వందలాది మంది విద్యార్థులు ప్రతి రోజూ ఉన్నత విద్య కోసం బెల్లంపల్లి, మంచిర్యాల తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు.బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు కాలినడకన మందమర్రి చౌరస్తా వరకు వెళ్లి అక్కడ బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కళాశాలలు, పాఠశాలలకు సమయానికి చేరుకోలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

## ఎమ్మెల్యే బొజ్జు పటేల్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

ప్రజాపక్షం / జన్నారం : టీ న్యూస్ మీడియాపై ఖానాపూర్ ఎంఎల్ఎ వెడ్మ బొజ్జు పటేల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఉమ్మడి జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంఘాల ఆధ్వర్యంలో జన్నారం మండల ప్రెస్ క్లబ్ సభ్యులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ వాట్సాప్ గ్రూపులో ఎమ్మెల్యే స్వయంగా చేసిన వ్యాఖ్యలను టీ న్యూస్ ప్రజలకు అందించిందని తెలిపారు. తన వ్యాఖ్యలను సరిదిద్దుకోవాల్సింది పోయి మీడియాపై అసభ్య పదజాలంతో దూషించడం ప్రజాప్రతినిధికి తగదని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తూ విధిని నిర్వర్తిస్తున్న మీడియాపై అసభ్య వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనన్నారు. ఎంఎల్ఎ వెడ్మ బొజ్జు పటేల్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని టీ న్యూస్‌కు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రాష్ట్రస్థాయి వరకు జర్నలిస్టు సంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జన్నారం ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, ఉమ్మడి జిల్లా జర్నలిస్టులు పాల్గొన్నారు.

## బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాపక్షం / వాంకిడి : వాంకిడి మండలంలోని సామేల గ్రామ యువత, స్థానిక సర్పంచ్ వాడ్గురే సంతోష్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అదే తిరుపతి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. తిరుపతి నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో చికిత్స ఖర్చులకు చేయూతగా గ్రామ ప్రజలు తమకు తోచిన మేర విరాళాలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాడ్గురే సంతోష్ మాట్లాడుతూ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, గ్రామ యువత, పెద్దలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామస్థుల సహకారంతో బాధిత కుటుంబానికి కొంతైనా ఊరట కలిగించాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సాయం అందిస్తున్నామని, అవసరమైతే భవిష్యత్తులో కూడా తిరుపతి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్‌కు సిమెంట్ బెంచీల విరాళం

ప్రజాపక్షం / మందమర్రి : మందమర్రి పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ప్రెస్ క్లబ్ ఆవరణలో ప్రజల సౌకర్యార్థం మూడు సిమెంట్ బెంచీలను లయన్స్ క్లబ్ ప్రతినిధులు అందజేశారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320జి మందమర్రి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సొత్తుకు సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు పెంద్యాల గౌతమ్ చారి మాట్లాడుతూ సమాజ సేవే లక్ష్యంగా క్లబ్ అనేక ప్రజా ఉపయోగ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని తెలిపారు. మందమర్రి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల కోసం సిమెంట్ బెంచీల ఏర్పాటు, ఉచిత కంటి వైద్య శిబిరాలు, కంటి ఆపరేషన్లు, అన్నదాన కార్యక్రమాలు, ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నామని, నేత్రదానం గొప్ప మానవతా సేవ అని, మరణానంతరం కంటి దానం చేయడం ద్వారా చూపులేని వారికి వెలుగునిచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంపొందించుకొని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. క్లబ్ కార్యదర్శి లయన్ జాకీర్, కోశాధికారి బుర్ర ఆంజనేయులు, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ తౌటం శ్రీను, డైరెక్టర్లు లయన్ బింగి రాజన్న, లయన్ కొక్కుల మధు, లయన్ తాడికొండ లూథర్, లయన్ శంకర్ పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ రక్షణ

ప్రజాపక్షం / హాజీపూర్ : హాజీపూర్ మండలం ముల్కల ఘాట్ వద్ద గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను బ్లూ కోర్టు సిబ్బంది సకాలంలో రక్షించారు. మందమర్రి మండలం మేడారం గ్రామానికి చెందిన ఒక మహిళ నదిలోకి దూకగా, గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎస్ఐ కిరణ్ కుమార్ బ్లూ కోర్టు సిబ్బందిని ఘటనాస్థలికి పంపించి ఆమెను సురక్షితంగా బయటకు తీయించారు. అనంతరం ఆమెను పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ రక్షణ చర్యల్లో బ్లూ కోర్టు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## నారాయణపూర్‌లో మద్యం నిషేధం

ప్రజాపక్షం / రెబ్బెన : ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామపంచాయతీలో పూర్తిగా మద్యం అమ్మకాలను నిషేధిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. నారాయణపూర్, పైకాచిగూడ గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపులు, మందు దుకాణాలను నడపకూడదని గ్రామసభలో ప్రజల అంగీకారంతో ఈ తీర్మానం చేసినట్లు సర్పంచ్ మాదాసు రవీందర్ తెలిపారు. ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బెల్ట్ షాపుల్లో ఉన్న మద్యాన్ని ఈ నెల 20వ తేదీ సోమవారంలోగా అమ్ముకోవాలని, 21వ తేదీ మంగళవారం నుండి పూర్తిగా నిషేధం అమలులోకి వస్తుందని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తామని, సదరు ఇంటికి విద్యుత్ సౌకర్యం నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరికి బదులు ఆరుతడి పంటలు వేయాలి

ప్రజాపక్షం/కౌటాల : నాగేపల్లి గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ బిక్కు పటేల్ అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు అధికారులు సూచించారు. ఎల్‌నినో ప్రభావం, నీటి లభ్యత దృష్ట్యా జొన్న, మొక్కజొన్న, కందులు, సజ్జలు, రాగులు, నువ్వులు వంటి పంటలను సాగు చేయాలని అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పరిశీలన

కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీహరి రావు

**ప్రజా పక్షం/లక్ష్మణచాంద :** మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కనకాపూర్, రాచాపూర్, లక్ష్మణచాంద, మునిపెల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆయన.. బూత్ స్థాయిలో జరుగుతున్న కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారులతో (బీఎల్‌ఓ) మాట్లాడి వివరాలు తెలుసుకుని, వారికి పలు సూచనలు చేశారు. రాచాపూర్ బీఎల్ఓకు సన్మానం : ఓటరు నమోదు ప్రక్రియను నూటికి నూరు శాతం విజయవంతంగా పూర్తి చేసిన రాచాపూర్ బీఎల్‌ఓలను, బీఎల్‌ఏలను శ్రీహరి రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు పూర్తి పారదర్శకంగా విధులు నిర్వహించాలి. కూచాడి శ్రీహరి రావు (కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి) అర్హత కలిగిన ప్రతి పౌరుడు తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సకాలంలో సవరించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియను నియోజకవర్గ ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ నరేష్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, అబ్బడి ప్రతాపరెడ్డి, రాచాపూర్ సర్పంచ్ మహేష్, ఎంబడి రాకేష్, గాజుల రవికుమార్, కొట్ట శేఖర్, గంగాధర్ గౌడ్, నారాయణ, గుర్రం లింగారెడ్డి, చింతకింది శేఖర్ రెడ్డి, నల్ల రాజశేఖర్ రెడ్డి, రాజారెడ్డి, గుర్రాల దేవేందర్ రెడ్డి, పార్పెల్లి నర్సారెడ్డి, సమ్మెట రవి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆరోగ్య విస్తరణ అధికారి పెందోర్ రవిదాస్



**ప్రజాపక్షం / వాంకిడి:** వాంకిడి మండలంలోని గిరిజన గ్రామమైన సల్వాల్గుడ పరిధిలో శుక్రవారం ఇంటింటి జ్వర సర్వేతో పాటు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాపిడ్ ఫీవర్ సర్వే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య విస్తరణ అధికారి పెందోర్ రవిదాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండనీయకుండా చూడాలని, వారానికి ఒకసారి నీటి టబ్బులు, డ్రమ్ములు, కూలర్లను శుభ్రం చేయాలని పేర్కొన్నారు. రాబోయే మూడు నెలల పాటు తాగునీటిని తప్పనిసరిగా కాచి చల్లార్చి తాగాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 42 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ఉమారత్నమాల, అంగన్‌వాడీ కార్యకర్త కౌసల్య, ఆశా కార్యకర్త పార్వతి పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా

**ప్రజాపక్షం/నిర్మల్ :** జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ, జల సంరక్షణ చర్యలు, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో ఎల్‌నీనో ప్రభావంతో జూలై నెలలో సుమారు 30 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా సోన్ మండలంలో 50 శాతం వరకు వర్షాభావం ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 4.30 లక్షల ఎకరాల్లో పంటల సాగు కొనసాగుతోందన్నారు.నీటి లభ్యతను అంచనా వేసిన తర్వాతే వరి నాట్లు వేయాలని రైతులకు సూచించిన కలెక్టర్, సాగునీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా కంది, ఆయిల్‌పామ్, కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటలను సాగు చేయాలని కోరారు. ఒక ఎకరంలో కంది పంట ద్వారా 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి సాధించి రైతులు ఆర్థికంగా లాభపడే అవకాశం ఉందన్నారు. వరి సాగు వల్ల నీటి కొరత కారణంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు.జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపై రైతుల్లో అవగాహన పెరుగుతోందని, గతంలో 400 ఎకరాల్లో ఉన్న సాగు విస్తీర్ణం ఈ ఏడాది 1,200 ఎకరాలకు పెరిగిందని తెలిపారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు సాగు చేసే అవకాశం ఉండటంతో పాటు ప్రభుత్వం సబ్సిడీలు, ప్రోత్సాహకాలు కూడా అందిస్తోందన్నారు. పందిరి కూరగాయల సాగుకు 50 శాతం రాయితీ అందుబాటులో ఉందని చెప్పారు. బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చని, డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం రాయితీలు ఇస్తోందని వివరించారు.రైతులకు అవసరమైన సలహాలు, సాంకేతిక మార్గదర్శకాలు అందించేందుకు 89777 51785 హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.భూగర్భ జలాల సంరక్షణకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత, ప్రతి పొలానికి ఒక ఫామ్ పాండ్ లక్ష్యంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. 8×8, 16×16, 20×20 పరిమాణాల్లో ఫామ్ పాండ్లు నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని భూగర్భ జలాలను పెంపొందించవచ్చన్నారు. బోర్‌వెల్‌ల వద్ద రీచార్జ్ పిట్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద ఫామ్ పాండ్ల నిర్మాణాలకు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖలు సమన్వయంతో గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పంట మార్పిడి, నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత ప్రచారం చేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు.ఎస్ఐఆర్ కార్యక్రమానికి ప్రభుత్వం ఆగస్టు 3 వరకు గడువు పొడిగించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 75 శాతం డిజిటలైజేషన్ పూర్తి కాగా, అన్‌కలెక్టెడ్ ఫారాల పరిష్కారంతో కలిపి మొత్తం 81 శాతం ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగిలిన ఫారాల సేకరణ, డిజిటలైజేషన్‌ను బీఎల్‌ఓలు, బీఎల్ఏలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల సమన్వయంతో నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు.

## నిర్మల్ జిల్లాలో నేరాల దర్యాప్తునకు 'కృత్రిమ మేధస్సు

(సిసిటిఎన్ఎస్ఎఐ)

పైలట్ ప్రాజెక్ట్‌పై ఎస్పి సమీక్ష



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నేరాల దర్యాప్తులో సాంకేతికతను జోడించి బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నుండి అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సిసిటిఎన్ఎస్ఎఐ (కృత్రిమ మేధస్సు పైలట్ ప్రాజెక్ట్) అమలు తీరుపై ఆమె దిశానిర్దేశం చేశారు.సాంకేతికతతో వేగవంతమైన దర్యాప్తు ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సిసిటిఎన్ఎస్ఎఐ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా కేసుల దర్యాప్తు మరింత వేగవంతంగా, నాణ్యంగా సాగుతుందని తెలిపారు. కృత్రిమ మేధస్సు (ఎఐ) సాంకేతికతను వినియోగించడం వల్ల దర్యాప్తు అధికారులకు కింది ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. సమాచార లభ్యత: దర్యాప్తునకు అవసరమైన కీలక సమాచారాన్ని త్వరగా సేకరించవచ్చు. చట్టపరమైన విశ్లేషణ: కేసులకు సంబంధించిన చట్టపరమైన అంశాలు,గత నిబంధనలను సులభంగా విశ్లేషించవచ్చు. డిజిటల్ ఆధారాల పరిశీలన ఆధునిక డిజిటల్ సాక్ష్యాలను త్వరితగతిన విశ్లేషించేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుంది. శిక్షల శాతం (సిఆర్) పెంచడమే లక్ష్యం కేసుల దర్యాప్తును శాస్త్రీయంగా, పక్కా సాంకేతిక ఆధారాలతో పూర్తి చేయాలి. కోర్టుల్లో బలమైన సాక్ష్యాధారాలను సమర్పించడం ద్వారా నేరస్థులకు శిక్షలు పడేలా (సిఆర్) చూడడమే ఈ పైలట్ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ (జిల్లా ఎస్పీ)ప్రతి దర్యాప్తు అధికారి సిసిటిఎన్ఎస్ఎఐ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎస్పీ ఆదేశించారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీతో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల్లో విజయం సాధించాలి

కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉచిత శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను నిరంతరం అధ్యయనం చేయడం ద్వారా పోటీ పరీక్షలలో విజయం సాధించవచ్చని, భవిష్యత్తులోనూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్చార్జ్ డా.డి.లక్ష్మీ నరసింహం మాట్లాడుతూ పోటీ పరీక్షలలో రాణించాలంటే సిలబస్ ప్రకారం ప్రామాణిక పుస్తకాలు చదవాలని సూచించారు. అనంతరం శిక్షణకు హాజరైన విద్యార్థులకు ఓఎంఆర్ విధానంలో నమూనా పరీక్ష నిర్వహించారు. కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు డా. వి. దేవేందర్ రూపొందించిన ఇమెటీరియల్‌ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. శారద, అధ్యాపకులు రాజేశ్వర్, దత్తాత్రేయ, కృష్ణవేణి, డా. దేవేందర్, వెంకటేశం, రోజ్ మేరీ, బోధనేతర సిబ్బంది సత్యనారాయణ, కిష్టయ్య, ముకుందరావు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుతోనే లాభాలు

వ్యవసాయ అధికారి కృష్ణ

**ప్రజాపక్షం/హాజీపూర్ :** హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో శుక్రవారం సహజ వ్యవసాయం, జాతీయ సహజ వ్యవసాయ మిషన్ పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజీపూర్ వ్యవసాయ అధికారి కృష్ణ మాట్లాడుతూ సహజ వ్యవసాయంలో బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం, దశపర్ణి వంటి సేంద్రియ ద్రావణాల తయారీ, బహుళ పంటల సాగు విధానాలపై రైతులకు వివరించారు. వర్షాభావ పరిస్థితుల్లో వరికి బదులుగా పప్పుదినుసులు, కూరగాయలు, జొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని, పంటల మార్పిడిలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని సూచించారు. వరి ఒక ఎకరానికి వినియోగించే నీటితో ఇతర పంటలను రెండు నుండి మూడు ఎకరాల్లో సాగు చేయవచ్చని తెలిపారు. పెట్టుబడి లేని వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని కాపాడుకోవాలని కోరారు. వ్యవసాయ విస్తరణాధికారి మధుప్, కృషి సఖి స్వప్న, సేంద్రీయ రైతులు గడ్డం రవీందర్ రెడ్డి, గంగా రెడ్డి, వెంకట్ రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రైతులకు ఆర్థిక భద్రతతో మెరుగైన మార్కెటింగ్ కల్పిస్తుంది

రైతులు, వ్యాపారులు, రైస్ మిల్లు యజమానులకు డబ్ల్యూ.డి.ఆర్.ఎ చట్టంపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** రైతులు తమ పంటను శాస్త్రీయంగా నిల్వ చేసుకుని, అనుకూల సమయంలో విక్రయించి మెరుగైన ఆదాయం పొందేందుకు ఉపయోగపడే వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ (డబ్ల్యూ.డి.ఆర్.ఎ) చట్టంపై రైతులు, వ్యాపారులు,రైస్ మిల్లు యజమానులకు శుక్రవారం జగిత్యాల పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంఘ అధ్యక్షులు పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి అధ్యక్షతన, జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్ డైరెక్టర్ శ్యామ్ కుమార్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా నిపుణులు మాట్లాడుతూ, డబ్ల్యూ.డి.ఆర్.ఎ చట్టం ముఖ్య ఉద్దేశాలు, గిడ్డంగుల నమోదు విధానం,వేర్‌హౌస్ రసీదుల ప్రాముఖ్యత, పంట నిల్వ విధానాలు, గిడ్డంగి రసీదు ఆధారంగా బ్యాంకుల నుంచి రుణ సౌకర్యాలు పొందే విధానం, రైతులకు కలిగే ప్రయోజనాలపై సమగ్రంగా వివరించారు. రైతులు తమ పంటను గుర్తింపు పొందిన గిడ్డంగుల్లో భద్రపరిస్తే, మార్కెట్‌లో మంచి ధర లభించే వరకు నిల్వ ఉంచుకునే అవకాశం ఉంటుందని, అలాగే వేర్‌హౌస్ రసీదును ఆధారంగా చేసుకుని బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు పొందవచ్చని వారు తెలిపారు. రైతులు తమ సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకోగా, వ్యవసాయ రంగానికి ఉపయోగపడే పలు సూచనలు, సలహాలను అందించి అందరు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తిరుపతి నాయక్, సంఘ కార్యదర్శి గంగాజి వేణు, డైరెక్టర్లులు అల్లాల రమేష్ రావు, ఆరుముల్ల గంగారాం, కొక్కుల శంకరయ్య, తోట గంగరాజం, బేతి రాజవ్వ లక్ష్మి రెడ్డి, నీలం లక్ష్మి నర్సయ్య, ఏలేటి రాజిరెడ్డి,సిబ్బంది రాజేష్,మల్లేష్, సుమన్, నవీన్, అజయ్,నారాయణతో పాటు రైతులు, వ్యాపారులు, సహకార సంఘ సభ్యులు, సంబంధిత అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బెడ్లు తక్కువ పెషేంట్లు ఎక్కువ

**ప్రజాపక్షం/ముధోల్ :** నియోజకవర్గ కేంద్రం ముధోల్ లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి దినదినాన దుర్భరస్థితికి చేరుతోంది.ఆసుపత్రికి వచ్చే పెషేంట్లు పెరుగుతున్న సదుపాయాలు మాత్రం ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉంది.ముధోల్ లో సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ ఆసుపత్రి భవన డిమాండ్ నియోజకవర్గ కేంద్రంతో పాటు చుట్టూ పక్కల గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల కలగా ఉన్న అది కలగానే మిగిలిపోయేటట్లు ఉంది కానీ ఇప్పట్లో నిజమయ్యేటట్లుయితే లేదు. ఎన్నో ఏళ్లుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా కొనసాగిన ఆసుపత్రిని సామజిక ఆరోగ్య కేంద్రంగా మార్చిన ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు మాత్రం స్పష్టంగా కరువయ్యాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆసుపత్రిని మెరుగుపర్చాలని అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నూతన భవన నిర్మాణ పనులు బేస్మెట్ దశకే పరిమితమయ్యాయి. ఆయా కారణాలతో ఆగిన పనులు నేటి వరకు ప్రారంభం కాలేదు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి సామజిక ఆరోగ్య కేంద్రం పేరును మార్చి సిబ్బంది పెంచిన వసతులు సరిగా లేక ఉన్న కాడికి వారి విధులు వారు నిర్వహిస్తూ వెళ్లిపోతున్నారు.కొంత మంది సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ వారి ఆవేదన పట్ల చెలగాటమాడుతున్నారు.ఇలా రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిని ఆసుపత్రి ఉన్నతాధికారులు మందలించక తప్పదని రోగులు కోరుతున్నారు. ఒకే బెడ్డుపై ముగ్గురు పిల్లలు : వాతావరణంలోని మార్పులతో పెద్దవారితో పాటు చిన్న పిల్లల్లో సైతం జ్వరాలు, వాంతులు, విరోచనాల పెషేంట్లు ఈ మధ్య బాగా పెరిగినట్లు ఆసుపత్రి వైనమే చెబుతోంది.శుక్రవారం ముగ్గురు పిల్లలని ఒకే బెడ్డుపై కూర్చోబెట్టి సిబ్బంది వైద్యం అందించారు. బెడ్డుపై పడుకోబెట్టి అందించాల్సిన వైద్యాన్ని కూర్చోబెట్టి దాంతోపాటు ఒకే బెడ్డుపై ముగ్గురిని వైద్యం అందిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాల్సిందే! ఉన్న ఆసుపత్రిలోనే కొంత స్థలంలో మరికొన్ని బెడ్లను ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందిస్తే మంచిది.ప్రస్తుతం ఆసుపత్రిలో 20 బెడ్లు మించి లేనట్లున్నాయి.మరికొన్ని బెడ్లుంటే ఉన్న స్థలంలోనే బెడ్లను వేసి ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఉన్న కనీస వైద్యాన్నందించిన అది ఇప్పట్లో ముధోల్ ప్రజలకు అందుతున్న వరమే అనుకోవాలి తప్ప మెరుగైన సౌకర్యాలను కోరిన అవి ఇప్పట్లో తీరేటట్లు లేవు. నిరుపేదలకు వైద్య ఇబ్బందులు, ఆర్థిక భారం తప్పేలా లేవు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బంది : ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగుల పట్ల కొందరు ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.ఇలా రోగుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని ఆసుపత్రి సూపరిండెంట్ వారిని మందలించి ఉన్న కనీస సేవలు సక్రమంగా అందేట్లు చూడాలని కోరుతున్నారు.సామజిక ఆసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి ముధోల్ తో పాటు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం కృషి చేయాలనీ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్న యాదవ్ కోరారు.ఇక్కడి ప్రజలు వైద్యం కొరకు ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో వ్యయ ప్రయాసాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనిని దృష్టిలో ఉంచుకుని స్థానిక ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్షను నెరవేర్చాలని విన్నవించారు.



## ఆదర్శ్ నగర్ బోనాలు

### మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని ఆదర్శ్ నగర్ కాలనీలో బోనాల పండుగను స్థానిక ప్రజలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాలనీ ప్రజలతో కలిసి ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు : ఈ సందర్భంగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ విశిష్ట సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల పండుగ ఒక అద్దం పడుతుందని కొనియాడారు. ప్రజలంతా ఈ ఉత్సవాలను భక్తిభావంతో, సామరస్య పూర్వకంగా జరుపుకోవడం సంతోషదాయకమన్నారు.జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రతి ఇల్లు సుఖసంతోషాలతో నిండాలని అమ్మవారిని ప్రార్థించాను.ఆయన కాలనీ వాసులందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.మాజీ మంత్రితో పాటు సాయన్న, పూజారి మురళి, హనుమంతు, ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్,ఆత్మ మాజీ చైర్మన్ గంగారెడ్డి, బిఆర్ఎస్ మండల కన్వీనర్ మల్లేష్,రవి కిరణ్, మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి మరియు స్థానిక కాలనీ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డిఆర్ఓ ఎంపిఓ విస్తృత తనిఖీలు

**ప్రజా పక్షం /దిల్వార్పూర్ :** మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మండల పరిషత్ అధికారి (ఎమ్పీఓ) గోవర్ధన్ మరియు మండల ప్రత్యేకాధికారి (డి.ఆర్.ఓ) విస్తృత తనిఖీలు నిర్వహించారు. మాయాపూర్ జీపీ రికార్డుల పరిశీలన : ఉదయం ఎమ్పీఓ గోవర్ధన్ మాయాపూర్ గ్రామ పంచాయతీని సందర్శించారు. జీపీకి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం గ్రామంలోని వైకుంఠ ధామం, సెగ్రిగేషన్ షెడ్ (చెత్త వేరుచేసే కేంద్రం), నర్సరీలను తనిఖీ చేశారు. అలాగే స్థానిక ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థుల హాజరును, అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. గుండంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల సందర్శన : మధ్యాహ్నం మండల ప్రత్యేకాధికారి (డి.ఆర్.ఓ) గారు, ఎమ్పీఓ గోవర్ధన్తో కలిసి గుండంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పంచాయతీ కార్యదర్శి కూడా పాల్గొన్నారు.అధికారులు పాఠశాలలోని తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, కిచెన్ గార్డెన్, ఆర్.ఓ ప్లాంట్ (తాగునీటి సౌకర్యం) మరియు మరుగుదొడ్లను నిశితంగా పరిశీలించారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఉపాధ్యాయులకు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.

## బాపునగర్లో మన ఊరు మన భద్రత అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని బాపునగర్ గ్రామంలో ఎడపల్లి మండల పోలీసు అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ నగనూరి అనురాధరాజశేఖర్, పాలకవర్గం సౌజన్యంతో మన ఊరు మన భద్రత మన బాధ్యత సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామంలోని యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని అప్రమత్తం చేశారు. గ్రామంలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు, పోలీస్ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ప్రోత్సాహకం

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఎల్నినో ప్రభావం వల్ల రైతులు నష్టపోకుండా వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగు పై ప్రత్యేక ప్రోత్సాహకం అందిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా నాణ్యమైన మొక్కల సరఫరాతో పాటు అంతర పంటల సాగు, తోట నిర్వహణ కోసం నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వం రాయితీలు అందజేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ పంట ద్వారా రైతులు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.జిల్లాలో పట్టా భూమి కలిగి ఆయిల్ పామ్ సాగు చేయదలచిన ఒంటరి మహిళా రైతులకు ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం అందించే నాలుగు సంవత్సరాల రాయితీలతో పాటు, రైతుకు అయ్యే అదనపు వ్యయాన్ని జిల్లా కలెక్టర్ ఆధీనంలోని నిధుల ద్వారా ప్రత్యేక రాయితీగా అందించనున్నట్లు తెలిపారు.జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించడం, రైతులను ప్రత్యామ్నాయ లాభదాయక పంటల వైపు ప్రోత్సహించడం, అలాగే ఒంటరి మహిళలను ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ ప్రత్యేక ప్రోత్సాహకాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.అర్హులైన ఒంటరి మహిళా రైతులు ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయిల్ పామ్ సాగు చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పొందాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం సమీప ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో కోరారు.



## నిర్మల్ జిల్లా లో దొంగల బీభత్సం

### పల్లెల్లో నిద్రలేని రాత్రులు

### పోలీసు గస్తీ కరవై జనం బేజారు!

**ప్రజా పక్షం /నిర్మల్ :** నిర్మల్ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. ఒకప్పుడు అర్ధరాత్రి వేళల్లో సైరన్లు, హారన్లు మోగిస్తూ తిరిగిన పోలీసు వాహనాలు ఇప్పుడు పల్లెటూళ్ల వైపు కన్నెత్తి చూడకపోవడంతో దొంగలు పండగ చేసుకుంటున్నారు. నిఘా లోపాన్ని ఆసరాగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతుండటంతో పల్లె ప్రజలు గుండెచేతిలో పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న దొంగతనాలతో గ్రామాల్లో నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు లేక కరువు.. దొంగల వేట! సకాలంలో వర్షాలు పడకపోవడంతో జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కరువు కాలాన్ని ఆసరాగా చేసుకుంటున్న దొంగల ముఠాలు. ఇళ్ల తాళాలు పగులగొట్టి క్షణాల్లో సొమ్ముతో పరారవుతున్నాయి. ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో, దొంగలు ఇక ఇదే సమయం అంటూ అర్ధరాత్రి వేళల్లో ఇళ్లను గుల్ల చేస్తున్నారు. ఉదయం లేచి చూసేసరికి ఇళ్ల తాళాలు విరిగిపోవడం, బీరువాల్లోని నగదు, బంగారం మాయమవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. పోలీసులకు అంతుచిక్కని వైనం! వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నా, క్లూస్ టీమ్స్ రంగంలోకి దిగుతున్నా దొంగల జాడ మాత్రం పోలీసులకు అంతుచిక్కడం లేదు.పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచడంలో, సరిహద్దుల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంలో వైఫల్యం కనిపిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రిపూట నామమాత్రంగా కూడా గస్తీ (పెట్రోలింగ్) లేకపోవడంతోనే దొంగలు యథేచ్ఛగా తమ పని కానిచ్చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాగే వదిలేస్తే ముమ్ముందు పరిస్థితి మరింత దిగజారి, ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తుల డిమాండ్ రాత్రి గస్తీ పునరుద్ధరించాలి శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాల్సిన పోలీస్ యంత్రాంగం తక్షణమే స్పందించాలని జిల్లా పల్లె ప్రజలు కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జానకంపేట్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పోచమ్మల సాయిలు అనే వ్యక్తి ఇటీవల పాము కాటుకు గురై మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో గ్రామ యువకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సహాయాన్ని, నిత్యావసర సరుకులను అందించి దాతృత్వాన్ని చాటారు. గ్రామానికి చెందిన సాయిలు అనే వ్యక్తి పాముకాటుకు గురై ఆస్పత్రికి తరలిస్తుండగా గురువారం మరణించారు. మృతుడి కుటుంబం నిరుపేద కావడంతో ఆయన కుటుంబానికి గ్రామానికి చెందిన యువకులు, ప్రజలు కలిసి విరాళాలు సేకరించి బాధిత కుటుంబానికి నగదును, నిత్యావసర సరుకులను అందచేశారు. బాధిత కుటుంబ సభ్యుల తరపున గ్రామ పెద్దలు పేరుపేరునా ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న మోహన్ రావుకు అపన్న హస్తం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** గోదావరిఖని విజయనగర్ ప్రాంతానికి చెందిన ముల్కాల మోహన్రావు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, చికిత్స మరియు మందుల ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కడమండ్ల శ్రీహరి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.ఈ విషయంపై వెంటనే స్పందించిన వ్యాల్ల హరీష్ రెడ్డి మోహన్రావు చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని తమ అనుచరుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ముల్కాల మోహన్రావు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.

## వర్షాల కోసం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/ముత్తారం :** సకాలంలో వర్షాలు కురిసి,పంటలు బాగా పండాలని కోరుకుంటూ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని హరిపురం గ్రామంలో శుక్రవారం గ్రామస్తులతో కలిసి సర్పంచ్ మెంగాని సమత తిరుపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ సర్పంచ్ మెంగాని సమత తిరుపతి,మాజీ సర్పంచ్ వేల్పూరి సంపత్ రావు,వార్డు సభ్యులు ఏగుర్ల జ్యోతి రాజు,యార సునిత రాజిరెడ్డి,అడ్డూరి మోహన్, చేనవేన సతీష్, తాడూరి మల్లయ్య, మెంగాని రవి,చిట్టెం పెల్లి రాజేందర్ పూజా కార్యక్రమాలను జరిపించారు.

## కొండగట్టు అంజన్న ఆలయ ఉద్యోగులకు నియామక పత్రాలు

**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఖాళీగా ఉన్న అర్చక, డోలు, సన్నాయి పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయినట్లు ఈవో అంజనా రెడ్డి తెలిపారు.దేవస్థానంలో మొత్తం ఆరు పోస్టుల కోసం ఈ ఏడాది మే 18న నిర్వహించిన అర్హత పరీక్షలో ఎంపికైన తిరునహరి ఆకాశ్ మనోజ్, వకుళాభరణం అరుణ్ కుమార్, ఆత్రిత్ తిరుక్కోవెల, తిరుక్కోవెల అజయ్ ప్రసాద్,మంగలి సుదర్శన్ బాబు , తిరుమల వెంకట అశోక్ లకు శుక్రవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కమిషనర్ ఎం.హన్మంతరావు,చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేసినట్లు తెలిపారు.

## జిపి నిధులను కరెంట్ బిల్లు చెల్లిస్తే జిపిల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుంది

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** గ్రామపంచాయితీలకు కేటాయించిన నిధులలో 15 శాతం మొత్తాన్ని విద్యుత్ బిల్లుల చెల్లింపునకు మళ్లించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జగిత్యాల జిల్లా పంచాయితీ అధికారి మదన్ మోహన్కు జగిత్యాల రూరల్,అర్బన్ మండలాల సర్పంచులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. సర్పంచులు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ,బ్లీచింగ్ చల్లడం, తాగునీటి సరఫరా,వీధి దీపాల నిర్వహణ వంటి అత్యవసర పనులు నిరంతరాయంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని సర్పంచులు తెలిపారు.

# బదిలీపై వెళ్లిన వెటర్నరీ డాక్టర్‌కు సన్మానం



ప్రజాపక్షం/ఆర్మూర్ : ఇటీవల సాధారణ బదిలీలో భాగంగా చేపూర్ గ్రామంలో విధులు నిర్వహించిన డాక్టర్ రాజేశ్వర్ బదిలీ కావటంతో పల్లె గ్రామానికి చెందిన యాదవుల సంఘ సభ్యులు శుక్రవారం శాలువతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో యాదవుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## 20 నుంచి కళాశాలలో డిగ్రీ కళాశాలలో స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు

ప్రజాపక్షం/భీమ్‌గల్: ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రవేశాలకు మరో అవకాశం లభించింది. దోస్త్ స్పెషల్ ఫేజ్ ద్వారా ఈనెల 20 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.సతీష్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం దోస్త్ స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఇప్పటివరకు డిగ్రీలో ప్రవేశం పొందని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బిఎ, బికాం, బిఎస్సీ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, గ్రంథాలయం, ప్రయోగశాలలు, డిజిటల్ బోధనతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంటాయన్నారు. డిగ్రీలో చేరదల్చిన విద్యార్థులు దోస్త్ పోర్టల్ ద్వారా స్పెషల్ ఫేజ్‌లో నమోదు చేసుకుని కళాశాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసంకళాశాల కార్యాలయాన్ని 9849278300 ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## ఎస్ఐఆర్‌లో వేగం పెంచాలి :డీసీసీ నాగేష్‌రెడ్డి



ప్రజాపక్షం/భీమ్‌గల్ : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియలో భీమ్‌గల్ పట్టణం వెనుకబడిన నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు కాటిపల్లి నాగేష్‌రెడ్డి శుక్రవారం అత్యవసరంగా భీమ్‌గల్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.ఈ సందర్భంగా పట్టణంలోని మొదటి వార్డుతో పాటు 171వ పోలింగ్ బూత్‌ను సందర్శించి ఇంటింటికి తిరుగుతూ కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. బూత్‌స్థాయి నాయకులు, తెలుసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో సమావేశమైన నాగేష్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చురుకుగా పని చేయాలని సూచించారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ఇంటింటికి వెళ్లి ఓటర్లకు అవగాహన కాంగ్రెస్ నాయకులు, బూత్‌స్థాయి కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌ని సన్మానించిన టిఎన్‌జివో నాయకులు



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖలో అసిస్టెంట్ కమిషనర్ డి. అరుణ్ కుమార్‌ని టిఎన్‌జివోస్ ఎక్సైజ్ సెంట్రల్ ఫోరమ్ ప్రతినిధులు, శాఖా సిబ్బంది ఘనంగా సత్కరించారు. శుక్రవారం నిజామాబాద్‌లోని కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని టిఎన్‌జివోస్ ఎక్సైజ్ సెంట్రల్ ఫోరమ్ కేంద్ర ఉపాధ్యక్షులు కె. అరుణ్ కుమార్, డిపిఇవో కార్యాలయ ఏవో వి. నరసయ్యలు ముఖ్య అతిథులుగా పాల్గొని, నూతన అసిస్టెంట్ కమిషనర్ డి. అరుణ్ కుమార్‌కి పుష్పగుచ్చాన్ని అందజేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధికారికి పూర్తి సహాయ, సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫోరమ్ మాజీ కార్యదర్శి ఎం. శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్‌లు ఎం. దేవేందర్, శేఖర్ రాజ్, రిజ్వాన్, సభ్యులు రాజు, నాగరాజు, రాణా, సబా, సాయిబాబా, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# గోమాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలి

### 27ననిర్వహించే గోసమ్మన్ ఆహ్వాన అభ్యాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి : రాజ్ పురోహిత్ సింగ్




ప్రజాపక్షం/నిజామాబాద్: గోమాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలని గోసమ్మన్ ఆహ్వాన అభ్యాన్ జిల్లా ప్రతినిధులు రాజ్ పురోహిత్‌సింగ్ కోరారు. గోమాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలని దేశం మొత్తంలో సాధుసంతుల ఆలోచనతో గో సమ్మాన్ ఆహ్వాన అభియాన కార్యక్రమాన్ని దుబ్బలో శ్రీకృష్ణ మందిర్ గోశాల వద్ద చేపట్టారు. ఈ సందర్భంగా గోసమ్మన్ ఆహ్వాన అభ్యాన్ జిల్లా ప్రతినిధులు రాజ్‌పురోహిత్‌సింగ్, రాజు మాట్లాడారు. దేశం మొత్తంలో గోమాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలని హిందూ బంధువుల 40 కోట్ల సంతకాల సేకరణతో ప్రధానమంత్రికి, రాష్ట్రపతికి, సిఎంకు, గవర్నర్‌కు సంతకాల పత్రాలను పంపించి దేశంలో ఉన్న హిందూ బంధువుల ఆలోచన తెలిపేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇందూరు జిల్లాలో సంతకాల సేకరణ ప్రారంభం చేయటం జరిగిందన్నారు. ఈ సంతకాల సేకరణలో ప్రతి ఒక్క హిందూ బంధువు ధార్మిక సంఘాలన్ని కూడా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో భాగంగా ఈనెల 27న సోమవారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద గణేష్ మందిర్ వద్దకు అందరూ హిందూ బంధువులు అధిక సంఖ్యలో వచ్చి అక్కడి నుంచి గో సమ్మన్ అభ్యాన్ ఆహ్వాన యాత్ర ప్రారంభించుకుని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి సేకరించిన సంతకాల పత్రాలని కలెక్టర్‌కు అందరూ చేయటం జరుగుతుందని తెలిపారు. 27న నిర్వహించే ఈ కార్యక్రమంలో హిందూ సంఘాలు, హిందువులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గో సమ్మన్ ఆహ్వాన అభ్యాన్ జిల్లా ప్రతినిధులు ముక్క జయకృష్ణ, అల్లాడి శ్రీధర్ పాల్గొన్నారు.

# హత్యకేసులో నిందితునికి పదేళ్ల జైలుశిక్ష : సిపి

ప్రజాపక్షం/నిజామాబాద్ : హత్య కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు వెలువరించారు. దీనికి సంబంధించిన వివరాలను సీపీ సాయిచైతన్య శుక్రవారం వెల్లడించారు. మెండోరా పిఎస్‌లో నమోదైన హత్య కేసులో నేరం రుజువు కావటంతో నిందితునికి 10 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ నిఆజమాబాద్ 1వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించిందన్నారు. మెండోరా మండలంలోని దూద్‌గాం గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు భాగ్యవతి నివాసానికి ఎదురుగా నిందితుడు బుచ్చన్న ఇంటి ముందున్న వేప చెట్టు విషయంలో గత నాలుగు సంవత్సరాలుగా వివాదాలు కొనసాగగా ఈ క్రమంలో 2022 జూన్ 2న ఉదయం సుమారు 9 గంటల సమయంలో ఫిర్యాదుదారు కుమారుడు వసంత్‌తో నిందితుడు గొడవకు దిగాడు. చంపాలనే ఉద్దేశ్యంతో అతని తలను పట్టుకుని గోడకు మూడుసార్లు బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆ గాయాలకు చికిత్స పొందుతూ బాధితుడు అనంతరం మరణించారు. అంత్యక్రియల అనంతరం బంధువులు జరిగిన విషయాన్ని తెలుసుకుని అదే రోజు మెండోరా పిఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని, అప్పటి సిఐ గోవర్ధన్‌రెడ్డి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి సమగ్ర ఆధారాలను సేకరించి కోర్టులో ఛార్జ్‌షీట్‌ఈ కేసులో నేరస్తుడికి శిక్ష పడటానికి కృషి చేసినటువంటి బి.గోవర్ధన్‌రెడ్డి, సిఐ ఆర్మూర్‌రూరల్(అప్పటి), జాన్‌రెడ్డి, ఆర్మూర్ రూరల్ (ఇప్పటి), అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింహారెడ్డి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ గోవింద్, ఎస్సై సిహెచ్ మురళీధర్ రాజు, ఎఎస్సై, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు ఎం.విషన్‌గౌడ్, సాయిచైతన్య అభినందించారు.

# బడి పిల్లలకు బట్టలు పంపిణీ చేసిన సర్పంచ్



ప్రజాపక్షం/ఆర్మూర్ : మండలంలోని పల్లె (హరిపూర్) గ్రామంలో పొద్దుటూరి వెంకట్ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో 28 మంది ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు బ్యాగ్‌లు, బట్టలు, షూస్‌లు శుక్రవారం పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ మనీషా సంజీవ్, వీడీసీ కోశాధికారి సాయంగౌడ్ హాజరై విద్యార్థులకు బట్టలు, బ్యాగ్‌లు, షూస్ అందజేసి మాట్లాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గ్రామంలోని పిల్లలకు అవసరమైన సహాయాన్ని ప్రతి సంవత్సరం అందించడంలో పొద్దుటూర్ వెంకట్‌నారాయనరెడ్డి కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. వారి తండ్రి కీ॥శే॥ రుక్మారెడ్డి జ్ఞాపకార్థం వారి సేవలు ఎప్పటికీ ఇలాగే మా పిల్లలపై ఉండాలని వారి కుటుంబానికి భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. వారి తండ్రికి మా గ్రామంలోని అనుబంధాన్ని వారి కుమారులైన వెంకట్‌నారాయణరెడ్డి కొనసాగించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ గంగారాం, ఉపాధ్యాయులు రమేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు లక్కవత్రి రాంసన్, వీడీసీ సభ్యులు పట్నూరి అశోక్, పూజారి శ్రీనివాస్, రాగం నరేష్, మంగలి శ్రవణ్, రుక్మారెడ్డి ఫంక్షన్ హాల్ సూపర్‌వైజర్ యాదగిరి పాల్గొన్నారు.

# నాయకత్వ పటిష్టతకు కృషి చేయాలి

### మాజీ మంత్రి అల్లోల



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఆకుల హరీష్ కుమార్ను రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన పట్టణ అధ్యక్షుడు హరీష్ కుమార్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు.ఈ సన్మాన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొంతం గణేష్, కోఆప్షన్ మెంబర్ మేడారం అపర్ణ ప్రదీప్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కొప్పుల శ్రీధర్, బీసీ సంఘం అధ్యక్షుడు అనుముల భాస్కర్, బీసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు రవి కిరణ్,సంతోష్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతన్న కోసం వేదం విద్యార్థుల గళం

ప్రజాపక్షం/బోథ్ : స్థానిక వేదం పాఠశాల విద్యార్థులు రైతుల కష్టాలు, వ్యవసాయం ఎదురుకుంటున్న సవాళ్లను హృదయానికి హత్తుకునేలా పాట రూపంలో ఆవిష్కరించారు. వాన కోసం ఎదురు చూసే రైతుల కష్టాలు తీరాలని వర్షం పడాలని దేవుడికి ప్రార్థనలు చేశారు. వానలు కురవాలని పంటలు సమృద్ధిగా పండాలి అని పాటలు పాడి తమ సంఘీభావాన్ని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారని, విత్తనాలు వేసి చాలా రోజులవుతున్న మొలకలు ఎండిపోతున్నాయని, రైతన్నలు ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారని,వర్షం కురిపించి రైతన్నల కష్టాలు తీరాలని కోరుతూ ఆలపించిన అభినయం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు పత్తి మొక్కజొన్న పై ఆగాహన సదస్సు



ప్రజా పక్షం /దిలావర్‌పూర్ : మండలంలోని మాదేగం గ్రామంలో వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి మరియు సర్పంచ్ మారుతి పటేల్ సమక్షంలో, పత్తి, మొక్కజొన్న పంటలలో చీడపీడలు, వ్యాధుల నివారణ మరియు పంట నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డా. కె. రాహుల్ విశ్వకర్మ, శాస్త్రవేత్త మరియు సమన్వయకర్త రైతులకు పంట సంరక్షణకు సంబంధించిన పలు సూచనలు అందించడం జరిగింది.పత్తి పంటలో: ప్రత్తి ఎల్బినో ప్రభావం తో ఆకులు వడలు పోయి రసం పీల్చే పురుగులైన బంక లాంటివి . చొప్పున పిచికారీ చేయాలని సూచించారు.ఎకరానికి 8–10 నీలం, పసుపు, తెలుపు రంగు స్టిక్కీ ట్రాప్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు.45 రోజుల దశలో మొక్క ఎదుగుదల లో చమత్కార్ మందును 1.2 ml లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు.బొట్టు పెట్టే పద్ధతిలో రసంపీల్చే పురుగుల నివారణ కోసం ఉలాలా మందును 1:20 నిష్పత్తిలో 45 రోజులు తర్వాత కాండానికి పూయాలని వివరించారు.మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 ml లేదా spinitoram 1 ml లీటరు నీటికి కలిపి పిచుకారి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా రైతులు పంటల సమగ్ర యాజమాన్యం, చీడపీడలు మరియు వ్యాధుల నివారణపై విలువైన అవగాహన పొందడం జరిగింది.